www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 14 అక్టోబర్ 2023
5
పశ్చిమ గోదావరి



లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం జెసి సమిత్వ, రీసర్వే అంశాలపై జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు క్రమ పద్ధతిలో పనులు నిర్వహించినప్పుడే మెరుగైన ఫలితాలు సాధించగలమన్నారు. మూడో దశలో 20 మండలాల్లో 104 గ్రామాలు సర్వే జరుగుతోందన్నారు. వాటిలో సుమారు 21 గ్రామాలు విజయవంతంగా పూర్తిచేసినట్లు తెలిపారు. సమావేశంలో డిఆర్ఒ కె.కృష్ణవేణి, డిప్యూటీ ట్రెయినీ కలెక్టరు కానాల సంగీత్ మాధుర్, ఆర్‌డిఒలు దాసి రాజు, కె.చెన్నయ్య, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జివికె మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

'ఆశా'ల ఆశలు ఆవిరి..!

ఆశా కార్యకర్తల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోంది. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేతో మరింత పనిభారం పెరిగి తల్లడిల్లుతున్నారు. పని ఒత్తిడి తట్టుకోలేక రకరకాల అనారోగ్య సమస్యలు చుట్టుముట్టడంతోపాటు మృత్యువాత కూడా పడుతున్నారు. ఇటీవల గుంటూరు జిల్లాలో ఆశా కార్యకర్త మృతితో జిల్లాలో ఆశాలు ఆందోళన చెందుతున్నారు. రకరకాల పరీక్షలు, సర్వేలు చేయడంతోపాటు ప్రతిరోజూ 60 కుటుంబాలను సందర్శించి వారి ఆరోగ్య అంశాలు చూడడంలో తలమునకలవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విధానాల పట్ల ఆశాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో సేవలందిస్తున్న ఆశా కార్యకర్తలు

- పని ఒత్తిడితో సతమతం
- జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలతో మరింత భారం
- పని ఒత్తిడి తట్టుకోలేక మృత్యువాత
- తాడేపల్లి ఘటనతో జిల్లాలో ఆశాలు ఆందోళన
- ప్రభుత్వ తీరు పట్ల ఆశాలు ఆగ్రహం

ప్రజాశక్తి - భీమవరం

వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పని చేస్తున్న ఆశా కార్యకర్తలు గ్రామస్థాయిలో ఆరోగ్య సేవలందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. అయితే ప్రజల ఆరోగ్య పరిస్థితులు చూసే ఆశా కార్యకర్తల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోంది. దీంతో ఆశాల జీవితాలు ఆవిరైపోతున్నాయి. వివిధ రకాల పనులు, అనేక రకాల సర్వేలతో విపరీతమైన పనిభారాన్ని మోపి ఆశాలను అన్ని రకాలుగా ప్రభుత్వం ఒత్తిడికి గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో ఆశాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో సుమారు 1400 మంది ఆశా కార్యకర్తలు పని చేస్తున్నారు. బిడ్డ పుట్టిన దగ్గర నుంచి పిసిజి టీకా వేసిన తర్వాత ప్రతినెలా 15 రోజులకు ఒక ఇంజక్షన్, పదో నెలలో మరొకటి, 16 నెలల నుంచి 24 నెలల తర్వాత ఒక ఇంజక్షన్ ఆశా కార్యకర్తలు వేస్తున్నారు. ప్రతి ఆరు నెలలకోసారి విటమిన్ ఎ, 16 నెలల నుంచి ఐదేళ్లలోపు, పదేళ్ల నుంచి 16 ఏళ్లలోపు ఇంజక్షన్ ఇస్తున్నారు. అలాగే అంగన్‌వాడీ స్కూళ్లలో ఐఎఫ్ఎ సిరప్‌లు, ప్రతి గురువారమూ ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్నారు. వర్షాకాలం, వేసవికాలంలో ఫీవర్ సర్వేలు, ప్రతి శుక్రవారమూ డ్రైడే నిర్వహించడంతోపాటు ఇంటి పరిసరాల్లో నిల్వ ఉన్న వ్యర్థాలను కూడా ఆశాలే తొలగిస్తున్నారు. ఈ సమయంలో ఆశాలు దయనీయ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. పుట్టిన దగ్గర నుంచి 16 ఏళ్లలోపు వారి ఆరోగ్య బాధ్యతలను ఆశా కార్యకర్తలు భుజాన వేసుకుని మోస్తున్నారు. చిన్న ఆరోగ్య సమస్య ఏర్పడినా సూచన సలహాలు ఇవ్వడంతోపాటు ఆరోగ్య సేవలందిస్తున్నారు.

ఆశాలతో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఆశాలపై మరింత పని ఒత్తిడిని పెంచింది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టే ముందు గ్రామస్థాయిలో సచివాలయ పరిధిలో ఇంటింటా సర్వే చేస్తున్నారు. ఈ సర్వేను పూర్తిగా ఆశాలపైనే వైద్యశాఖ అధికారులు మోపుతున్నారు. వాస్తవానికి గ్రామస్థాయిలో ఉన్న ఎఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్లు జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చేయాల్సి ఉంది. కేవలం ఆశాలను సహాయకులుగా మాత్రమే వినియోగించాల్సి ఉంది. అయితే కింద స్థాయిలో ఆ విధంగా జరగట్లేదు. కేవలం ఆశాలపైనే సర్వేల భారాన్ని మోపుతున్నారనే విమర్శలున్నాయి. బిపి, షుగర్, హెచ్‌బి, మలేరియా, డెంగీ ఇలా అన్ని పరీక్షలు ఆశాలే చేస్తున్నారు. సచివాలయ పరిధిలో ఆశా కార్యకర్తలు 18 రోజులపాటు సర్వేలు చేస్తున్న పరిస్థితి ఉంది. ఇదేంటని ఆశాలు ప్రశ్నిస్తుంటే ఈ సర్వేలు మీరే చేయాలని, లేకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్థాయి ఆరోగ్యశాఖ అధికారులు బెదిరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఆశాలపై భారాన్ని మోపి వైద్య శాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆశా కార్యకర్తలు చేసేదేమీ లేక పని భారాన్ని మోస్తూ ఉద్యోగ బాధ్యతలు నెట్టుకొస్తున్నారు.

ఆందోళనలో ఆశాలు

కింద స్థాయిలో ఆరోగ్య శాఖలో ఆశా కార్యకర్తలు ప్రభుత్వ లక్ష్యాన్ని చేరువ చేస్తూనే ప్రజలకు ఆరోగ్యాన్ని అందించడంలో ఎనలేని కృషి చేస్తున్నారు. అయితే వారి ఆరోగ్యం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శలు విన్పిస్తున్నాయి. చాలీచాలని వేతనాలతో జీవితాలను నెట్టుకొస్తూనే ఉద్యోగ బాధ్యతల్లో రకరకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ చివరకు ఆశా కార్యకర్తలు మృత్యువాత పడుతున్నారు. ఇటీవల గుంటూరు జిల్లా తాడేపల్లి ప్రకాష్‌నగర్‌లో ఆశా కార్యకర్త కృపమ్మ పని ఒత్తిడి తట్టుకోలేక మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆశా కార్యకర్తలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తమ ఆరోగ్య పరిస్థితి ఏమిటో తెలియక నరకయాతన అనుభవిస్తున్నారు. పని ఒత్తిడితో జరగరానిది ఏమైనా జరిగితే తమ కుటుంబాల పరిస్థితి ఏంటోనని ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో తమ పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ఆశాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

18 రోజులు సర్వే చేశాం

కె.కరుణ, ఆశా కార్యకర్త, పెన్నాడ అగ్రహారం



ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను గ్రామంలో 18 రోజులపాటు చేశాం. బిపి, షుగర్, హెచ్‌బి, మలేరియా, డెంగీ పరీక్షలు కూడా చేశాం. ఆరోగ్యం బాగున్నా.. బాగోకపోయినా తాము మాత్రం ఎదుటివారి ఆరోగ్యాన్ని పట్టించుకోవాలి. కనీసం సెలవు కావాలన్నా ఇచ్చే పరిస్థితి లేదు. అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం.

పని ఒత్తిడి తట్టుకోలేకపోతున్నాం..

పి.మార్తమ్మ, ఆశా కార్యకర్త, పెన్నాడ అగ్రహారం



ప్రభుత్వం ఏ కార్యక్రమం తలపెట్టినా వివిధ రకాల సర్వేలు అప్పగిస్తోంది. ఫీవర్ సర్వే, ఫ్రైడే డ్రైడేతోపాటు ప్రతిరోజూ 60 కుటుంబాలను సందర్శించి సర్వేలు చేయాలి. 19 ఏళ్ల నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతుంది. పని ఒత్తిడి తట్టుకోలేకపోతున్నాం. రకరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఎవరికి చెప్పినా పట్టించుకోవట్లేదు. ఏం చేయాలో తెలియక నెట్టుకొస్తున్నాను.

భయం వేస్తోంది..

నంబూరి సంతోషి, ఆశా కార్యకర్త, పెనుమంట్ర



గతం కంటే పని ఒత్తిడి విపరీతంగా పెరిగింది. నిత్యం రకరకాల సర్వేలతో సతమతమవుతున్నాం. పని ఒత్తిడి తలెత్తడంతో దిక్కు తోచట్లేదు. గుంటూరు జిల్లాలో తోటి ఆరోగ్య కార్యకర్త పని ఒత్తిడితో మృతి చెందడంతో మా పరిస్థితి ఏంటని భయమేస్తోంది. చాలీచాలని వేతనాలతో జీవనం నెట్టుకొస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

ప్రభుత్వం ఆలోచించాలి

మేడిది భారతి, ఆశా కార్యకర్త, పెనుమంట్ర



వైద్య ఆరోగ్య శాఖలో కీలకపాత్ర పోషిస్తున్న ఆశా కార్యకర్తల పట్ల ప్రభుత్వం ఆలోచన చేయాలి. ప్రభుత్వ లక్ష్యాన్ని చేరువ చేస్తున్నాం. మాపై మాత్రం ప్రభుత్వానికి కనికరం లేదు. వేతనాలు పెంచడంతోపాటు పని భారాన్ని తగ్గించాలి. పనిఒత్తిడితో మృతి చెందిన కృపమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి. కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి.



విద్యుత్ ఛార్జీలపై ప్రచారం చేస్తున్న వామపక్ష నాయకులు

ప్రజలపై విద్యుత్ భారాలను ఉపసంహరించాలి

వామపక్షాల ఆధ్వర్యాన ప్రజాబ్యాలెట్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రజలు భరించలేని విధంగా పరిణమించిన వేల కోట్ల రూపాయల విద్యుత్ ఛార్జీల భారాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో మరో బషీర్‌బాగ్ వంటి విద్యుత్ ఉద్యమం తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు హెచ్చరించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు చేపట్టిన ఆందోళనలో భాగంగా శుక్రవారం స్థానిక ప్రకాశంచౌక్‌లో సిపిఎం, సిపిఐ, ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ కరపత్రాల పంపిణీ, సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ ట్రూఅప్ ఛార్జీలు, ఇంధన సర్దుబాటు ఛార్జీలు, పీక్ టైమ్ ఛార్జీలు, పెనాల్టీల రూపంలో రాష్ట్రంలో ప్రజలను విద్యుత్ ఛార్జీలతో వేల కోట్లు దోచేస్తున్నారని మండిపడ్డారు. స్మార్ట్ మీటర్లు, రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే యోచన విరమించుకోవాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ ఇంత దారుణంగా గతంలో ఎప్పుడూ విద్యుత్ భారాలు లేవని, ఎప్పుడో వాడిన కరెంట్‌కు ఇప్పుడు మళ్లీ సర్దుబాటు ఛార్జీలు, పెనాల్టీలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్యుడు ఇంటి అద్దెతో సమానంగా విద్యుత్ ఛార్జీలు కడుతున్నాడని, చిన్న పరిశ్రమలకు లక్ష రూపాయలు విద్యుత్ బిల్లు వస్తే, మరో రూ.90 వేలు అదనపు ఛార్జీల భారం పడుతోందని తెలిపారు. దీంతో చిన్న పరిశ్రమలు మూతపడే ప్రమాదం ఉందన్నారు. విద్యుత్ రంగంలో అవినీతి పేరుకుపోయిందని, కార్పొరేట్లకు కోట్లకు కోట్లు వెళ్తున్నాయని గోపాలన్ మండిపడ్డారు. ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలతో ప్రజల నడ్డి విరిగిందన్నారు. విద్యుత్ భారాలు ఉపసంహరించకపోతే ఉధృత ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నేతలు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, సిపిఎం నాయకులు బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ నాయకులు దండు శ్రీనివాసరాజు, కొత్తపల్లి సుబ్బరాజు, వాటాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తణుకు రూరల్: ప్రజలకు షాక్ కొడుతున్న కరెంట్ ఛార్జీలు తగ్గించాలని, సర్దుబాటు, ట్రూఅప్ పేరుతో భారాలు ఆపాలని సిపిఎం, సిపిఐ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఆ పార్టీల సంయుక్త సమావేశం శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. తొలుత కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్, సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు మాట్లాడుతూ ఇటీవల పెరిగిన కరెంట్ బిల్లులు చూసి ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. సర్దుబాటు, ట్రూఅప్ పేరుతో భారాలు ఆపాలన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టడం ఆపాలని డిమాండ్ చేశారు. విద్యుత్ భారలకు వ్యతిరేకంగా 14న కరపత్రాలు పంపిణీ, 15న ఆందోళన చేపడతామన్నారు. సమావేశంలో సిపిఐ నాయకులు బి.మురళి, గార ప్రసాద్, ఎన్.రాధాకృష్ణ, సిపిఎం నాయకులు గార రంగారావు పాల్గొన్నారు.

గణపవరం: విద్యుత్ భారాలకు నిరసనగా ఈ నెల 15న పిప్పర సెంటర్లో ప్రజాబ్యాలెట్ నిర్వహిస్తున్నట్లు సిపిఎం మండలం కమిటీ తెలిపింది. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల కమిటీ సమావేశం ఎస్.సంజీవరావు అధ్యక్షతన జరిగింది. జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ రకాల పేర్లతో ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాలను ఉపసంహరించుకోకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో మండల కార్యదర్శి పి.నరసింహమూర్తి, నాయకులు నరాలశెట్టి రామకృష్ణ, చిన్న నాగేశ్వరరావు, పి.గోవింద్ పాల్గొన్నారు.

కూరగాయల రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పెనుగొండ

కూరగాయల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని శుక్రవారం సిద్ధాంతంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన సదస్సు డిమాండ్ చేసింది. రైతు సంఘం ఆధ్వర్యంలో కుడిపూడి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు హార్టీకల్చర్ మండల అధికారి చందు కార్తీక్, డివిజన్ అధికారి ప్రియదర్శిని పాల్గొన్నారు. రైతులకు సూచనలిచ్చారు. అనంతరం రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ మాట్లాడుతూ మండలంలో సుమారు 750 ఎకరాల వరకూ రైతులు దొండ, బెండ, బీర, పొట్ల, అరటి, కంద, పసుపు, మిర్చి రకాలు పండిస్తున్నారని తెలిపారు. వీరికి ప్రభుత్వం నుండి సబ్సిడీ రూపంలో గానీ పెట్టుబడి రూపంలో గానీ సహకారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కూరగాయల పంటలకు ధర ప్రభుత్వమే నిర్ణయించాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ దేశానికి అన్నం పెడుతున్న రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో ఆచంట వెంకటేశ్వరరావు, పితాని ఉమామహేశ్వరరావు, రామకృష్ణ, గుబ్బల నాగేశ్వరరావు, పితాని సూర్యనారాయణ, కట్టా రామ లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఇవిఎంల పరిశీలన పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ఇవిఎంలు, వివి ప్యాడ్స్ పరిశీలనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి శుక్రవారం ఇవిఎంలు, వివి ప్యాడ్స్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్‌పై సన్నద్ధత, తదితర అంశాలపై జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జెసి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్ఒ కె.కృష్ణవేణి పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 16వ తేదీ నుంచి నిర్వహించే పరిశీలనలో ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. భీమవరం ఇవిఎం గోడౌన్లలో నిర్వహించే ఈ ప్రక్రియ కోసం అవసరమైన సీసీ కెమెరాలు, వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ట్రెయినీ డిప్యూటీ కలెక్టరు కానాల సంగీత్ మాధుర్, జిల్లా వనరుల శాఖ అధికారి పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి

రెవెన్యూ శాఖ పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ

సీనియర్ సివిల్ జడ్జి బి.అప్పలస్వామి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 21న నిర్వహించనున్న ప్రత్యేక లోక్‌అదాలత్‌లో రెవెన్యూ శాఖకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీనియర్ సివిల్ జడ్జి బి.అప్పలస్వామి సూచించారు. తన ఛాంబర్‌లో శుక్రవారం సాయంత్రం భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు యు.వర ప్రసాద్‌లతో ఆయన సమావేశమయ్యారు. భూనష్ట పరిహార కేసులు కూడా రాజీ చేసే దిశగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆర్‌డిఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ దుర్గ పాల్గొన్నారు.

ఉద్యోగుల వేతనాలివ్వాలని సిఐటియు ధర్నా



ధర్నా చేస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి - పోడూరు

ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సిఐటియు నేత పిల్లి ప్రసాద్ డిమాండ్ చేశారు. పోడూరు కొత్తపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా ఇచ్చే వేతనాలను సక్రమంగా ఒకటో తేదీకి ఇవ్వకపోవడం చాలా బాధాకరమన్నారు. నెలలు తరబడి ఇవ్వకపోవడం వల్ల ఉద్యోగులు అప్పు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి కాకర వెంకటేశ్వర్లు, కౌలు రైతుసంఘం మండల.కార్యదర్శి బొంతు శ్రీను, సిఐటియు మండల అధ్యక్షులు బూరాబత్తుల వెంకట్రావు, నేత సంసేను పాల్గొన్నారు.

అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి



ఫిర్యాదు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం బ్రాహ్మణచెరువు ఎంపిడిఒ కార్యాలయంలో మండలస్థాయి జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్ పి.ప్రశాంతి, డిఆర్ఒ కె.కృష్ణవేణి, డిఎల్‌డిఒ కెసి హెచ్.అప్పారావు, డిపిఒ జివికె.మల్లికార్జునరావుతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఫిర్యాదులు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశిత సమయంలోగా సమాధానం ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రతి అధికారీ తమ శాఖకు చెందిన అన్ని అర్జీలూ పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. వచ్చిన అర్జీల్లో 90 శాతం సచివాలయాల పరిధిలోనే ఉంటున్నాయన్నారు. అర్జీల పరిష్కారానికి సమయం అవసరమైతే అర్జీదారులకు కారణం తెలపాలని ఆదేశించారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో 74 అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి.అశోక్‌వర్మ, ఎంపిడిఒ పి.పద్మజ, వయో వృద్ధుల సంక్షేమ అప్పిలేటు ట్రిబ్యునల్ మెంబరు మేళం దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

నడిచే ఆసుపత్రులు ఆరోగ్య సురక్ష శిబిరాలు

డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అందరూ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో నడిచే ఆసుపత్రులుగా నిర్వహిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. మండలంలోని వెంకటరామన్నగూడెం పిహెచ్‌సి ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా మెడికల్ క్యాంపును శుక్రవారం నిర్వహించారు. దీనికి రాజమండ్రి జిఎస్ఎల్ ఆసుపత్రికి చెందిన రెండు మొబైల్ మెడికల్ ఎక్విప్మెంట్ యూనిట్లను (రెండు బస్సులు) రప్పించారు. వాటిలో అవసరమైన అత్యంత ఖరీదైన వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. వెంకట్రామన్నగూడెం పిహెచ్‌సి పరిధిలోని మండలానికి చెందిన 16 గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు శిబిరానికి హాజరై ఉచితంగా వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు గ్రామ సర్పంచి పొలిమోను నాగ అంజుష శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. అనంతరం మంత్రి కొట్టు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని మహా సంకల్పంతో ముఖ్యమంత్రి ఆరోగ్య సురక్షను ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అత్యంత ఖరీదైన గుండె, ఊపిరితిత్తులు, కేన్సర్ తదితర వ్యాధులకు సంబంధించి పరీక్షలు ఉచితంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యువనేత కొట్టు విశాల్, జెడ్‌పిటిసి ముత్యాల ఆంజనేయులు, ఎంపిపి శేషులత పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలో సమస్యలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పరిష్కరించాలని కోరుతూ సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పిప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బ్రాహ్మణచెరువులో ప్రభుత్వ పాఠశాల ఎదురుగా కొత్తకాలనీలో ఆటస్థలానికి కేటాయించిన స్థలంలో కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. సూర్యారావుపేట కొత్త కాలనీలో సుమారు ఏడు గృహ నిర్మాణాలు జరిగాయని కరెంటు స్తంభాలు వేసి కరెంటు మీటర్లు ఇవ్వాలని కోరారు. పెనుమంట్ర మార్కెట్ శాఖ గ్రంథాలయం ఏరియాలో ప్రధాన రహదారి వద్ద వైన్ షాప్ ఉందని, సమీపంలోనే హైస్కూల్ ఉండడం వల్ల విద్యార్థులపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. వైన్‌షాప్‌ను వెంటనే తొలగించి ఊరు శివారున పెట్టాలని డిమాండ్ చేశారు. ఓడూరులో దళితులు, బిసిల శ్మశానవాటిక సమస్య తీవ్రంగా ఉందన్నారు. నెగ్గిపూడి శివారు వనంపల్లిలో రోడ్డు, డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. పెనుమంట్ర రజికపేట కాలనీ నుంచి జుత్తిగ వెళ్లే రోడ్డును నిర్మించాలన్నారు. సమస్యపై తహశీల్దార్ దండు అశోక్ వర్మను వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. వినతి పత్రం అందించిన వారిలో మండల కమిటీ సభ్యులు కేతా పద్మజ, రాపాక ఆశీర్వాదం, కోడి శ్రీనివాస్ ప్రసాద్ , నేతలు ఉన్నారు.

19న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటల నుండి ఏలూరులోని జెడ్‌పి సమావేశ మందిరంలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అధ్యక్షతన నిర్వహిస్తామని జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అజెండాలో అంశాలపై నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

విద్యార్థులు పోటీతత్వం కలిగి ఉండాలి

భీమవరం రూరల్:ప్రతి విద్యార్థి పోటీతత్వం కలిగి ఉండాలని, పోస్టల్ శాఖ పిలుపు మేరకు పర్యావరణం, పోస్టల్ విధి విధానాలపై జరిగిన పోటీల్లో వందల మంది విద్యార్థులు పాల్గొనడం విశేషమని హెడ్ పోస్ట్ మాస్టర్ ఎస్ఎస్ ఆచార్యులు అన్నారు. శుక్రవారం శ్రీవిజ్ఞానవేదిక, పోస్టల్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తపాలా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ సూపరింటెండెంట్ అల్లు సురేష్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు వేసిన చిత్రాలు స్ఫూర్తినిస్తున్నాయన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. కార్యక్రమంలో అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఎస్ఐ చాన్‌పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా పేదల పాలిట వరం

ఆచంట:వైఎస్ఆర్ బీమా పేదల పాలిట వరమని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ స్పష్టం చేశారు. కొడమంచిలి పెదపేటకు చెందిన పిల్లి శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి వైఎస్ఆర్ బీమా ద్వారా మంజూరైన లక్ష రూపాయల చెక్కును మృతుని తల్లి నరపత్రులక సీతారామ్ శుక్రవారం అందజేశారు. అలాగే ఇటీవల శ్రీను ఇటీవలే మృతి చెందడంతో ఆయన తల్లికి తక్షణసాయం కింద రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా సీతారామ్ మాట్లాడుతూ నిరుపేదలకు కొండంత అండ వైఎస్ఆర్ బీమా అన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ భవానీ, వాలంటీర్లు ఉడి మేరీ, జిత్తుక మురళీకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు, అనర్థాలపై ప్రచార భేరి

భీమవరం రూరల్:భీమవరం టౌన్ రైల్వే స్టేషన్లో ఆర్‌పిఎఫ్ పోలీసు ఆధ్వర్యంలో సామాజిక దురాచారాలు, బాల్య వివాహాలు, అనర్థాల అనే అంశంపై ప్రచార భేరి నిర్వహించారు. శుక్రవారం రైల్వే సిఐ దస్తగిరి మాట్లాడుతూ ప్రచార భేరి దేశ వ్యాప్తంగా ఈ నెల 16వ తేదీ వరకూ నిర్వహిస్తున్నామని తెలిపారు. బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, బార్ అసోసియేషన్ సభ్యులు ఉండవల్లి రమేష్ నాయుడు, భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్య వివాహాల రద్దుపై చట్టాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రైల్వే ఎస్ఐ ఎంవిఎస్ చౌదరి, పి.అమూల్యరావు, ఎస్.ఏడుకొండలు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వరికి ఎండాకు తెగులు

పెనుమంట్ర:ప్రస్తుతం వరిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఎక్కువగా ఉందని ఉండి కెవికె శాస్త్రవేత్తల బృందం డాక్టర్ ఎన్.మల్లికార్జున రావు, డాక్టర్ ఎ.రాజేష్, డాక్టర్ ఎ.ఆనంద్ కుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని వెలగలవారిపాలెం, పెనుమంట్ర, బ్రాహ్మణచెరువు, ఆలమూరు, అత్తిలి మండలం మంచిలి గ్రామంలో పంట పొలాలను శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంటియు 1318, స్వర్ణ రకాల్లో బ్యాక్టీరియా, ఎండాకు తెగులు లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. దీనివల్ల తెగులు సోకిన వరి పొలం నుండి నీరు మరో పొలానికి వెళ్లినా తెగులు సోకుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఎఓ బి.టి.రాజేష్, పెనుమంట్ర ఎఓ జ్యోతి పాల్గొన్నారు.

ఆడపిల్లల రక్షణ బాధ్యత అందరిదీ

గణపవరం:ఆడపిల్లల రక్షణ బాధ్యత అందరిదని సరిపల్లి ఇండియన్ డిజిటల్ స్కూల్ డైరెక్టర్ జివి.ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆడపిల్లల రక్షణ కల్పించాలని కోరుతూ గణపవరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ నేటి సమాజంలో ఆడపిల్లలకు రక్షణ కరువైందన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను తిప్పికొట్టడానికి కరాటే, కుంగ్‌ఫూ వంటివి నేర్చుకోవాలన్నారు. ఈ ర్యాలీలో స్కూల్ ప్రిన్సిపల్ కె.పద్మినీదుర్గ, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

భీమవరం రూరల్:ఆపదలో ఉన్నవారికి, పేదలకు సహాయం చేయడం భగవత్ సేవతో సమానమని వైసిపి పట్టణ అధ్యక్షుడు చిగురుపాటి సందీప్ కుమార్ అన్నారు. ... శ్రీ సోమేశ్వరస్వామి దేవస్థానం వద్ద కోడే విజయ లక్ష్మి... సేవా సమితి ఆధ్వర్యంలో 50 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సేవా సమితి అధ్యక్షుడు కోడే యుగంధర్, సోమేశ్వరస్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ కోడే విజయలక్ష్మి మాట్లాడుతూ 3 రోజులపాటు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నామని, 14న 400 మంది మహిళలకు కామాక్షి అమ్మవారి దేవస్థానం వద్ద చీరలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

'రాజకీయ కక్షతోనే చంద్రబాబుపై కేసులు'

ఆచంట:మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై కేవలం రాజకీయ కక్షతో అక్రమ కేసులు బనాయించడం దారుణమని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అన్నారు. మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో ఆచంటలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 31వ రోజు కొనసాగాయి. కార్యక్రమంలో పితాని వెంకట్, టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య, బీరా నరసింహమూర్తి, సీతారాం నరసింహారావు, బోడపాటి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆకివీడు : అన్యాయంగా చంద్రబాబును అరెస్టు చేశారని ఎంఎల్ఎ మంతెన రామరాజు తెలిపారు. స్థానిక టిడిపి మండల కార్యాలయంలో పార్టీ కార్యకర్తల విస్తత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మొటుపల్లి ప్రసాద్, నౌకట్ల రామారావు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వెంకట్రావు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు తలపెట్టిన పోస్టు కార్డు ఉద్యమం పాత నవరసపురంలో శుక్రవారం కొనసాగింది. టిడిపి సీనియర్ నాయకులు ఆదిమూలం రామకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో టిడిపి కుటుంబ సభ్యులు పాల్గొని రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్‌కు పోస్ట్ కార్డులు పంపి నిరసన తెలిపారు.

పాలకొల్లు : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా గాంధీ బొమ్మ సెంటర్ వద్ద టిడిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు 31వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో చీపుర్లు పట్టి రోడ్డును శుభ్రం చేశారు.


గ్రామంలో నిర్మించిన సిమెంట్ డ్రెయిన్


పెదఅమిరంలో నిర్మించిన సిమెంట్ రోడ్డు


అవార్డును అందుకుంటున్న సర్పంచి సోమేశ్వరరావు

ఆదర్శ గ్రామం.. పెదఅమిరం

రూ.24 కోట్లతో గ్రామాభివృద్ధి
సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణం
పచ్చని మొక్కలతో ఆహ్లాదకర వాతావరణం

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరం గ్రామంలోని సమస్యలన్నీ దశలవారీగా పరిష్కారమయ్యాయి. ప్రభుత్వ నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేయడంతో మిగిలిన పంచాయతీలకు పెదఅమిరం ఆదర్శంగా నిలుస్తోంది. సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు, ఫిల్టర్ బెడ్లు, అదనపు ఓవర్ హెడ్ ట్యాంక్ మరమ్మతులు, వివిధ అభివృద్ధి పనులు రూ.24 కోట్లతో చేపట్టారు. దీంతో పెదఅమిరం అభివృద్ధికి చిరునామాగా మారింది.

నిత్యం చెత్త సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, పల్లెంతా పరిశుభ్రం ఆ గ్రామం ప్రత్యేకత. పచ్చదనం, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు, డంపింగ్ యార్డు నిర్మాణాలు, ఆహ్లాదకరమైన వాతావరణం గల పల్లె. ప్రతి వీధిలో సీసీ రోడ్డు, పంట, మురుగు కాల్వలు, పల్లె ప్రగతి'తో గ్రామం రూపురేఖలు మారాయి. ఇంతటి అభివృద్ధి చెందిన పెదఅమిరం ప్రగతి పథంలో ముందు వరుసలో నిలుస్తోంది.

వేల మందికి ఉపాధి అవకాశాలు..

గ్రామంలో ఏడు వేల మంది జనాభా నివసిస్తున్నారు. ఇక్కడ వరి, ఆక్వా, ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తున్నారు. ఇటీవల రియల్ ఎస్టేట్, చిన్న తరహా పరిశ్రమ, రొయ్యల కంపెనీలు, థర్మకోల్ ఫ్యాక్టరీలు, కార్ల షోరూమ్‌లు గ్రామ పరిధిలో నెలకొల్పారు. దీంతో వేల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందారు. ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు చకచకా పూర్తి చేశారు. నిత్యం ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేయడమే కాకుండా గ్రామ వీధుల్లో కలుపు మొక్కలను సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. గ్రామంలో మురుగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. గ్రామంలో మిగిలిన ప్రాంతాల్లో కూడా డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్నారు. దీంతో పల్లెంతా పరిశుభ్రంగా మారింది. ప్రతివీధిలో సీసీ రోడ్డు, మురుగు కాల్వలను నిర్మించడంతో స్వచ్ఛ గ్రామంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా, ప్రతి వీధిలోనూ మొక్కలు నాటారు. వివిధ రకాల మొక్కలతో గ్రామంలో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది.

సిమెంట్ డ్రెయిన్లు, రోడ్లకు మహర్దశ..

గ్రామంలో సిమెంట్ డ్రెయిన్లు, రోడ్లు నిర్మించడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో గ్రామంలో నిర్మించిన మెయిన్ రోడ్డు, సిమెంట్ రోడ్డు ఇరుగ్గా ఉన్నాయి. అయితే నందమ్మ గుడి నుంచి అబ్బాయి చెరువు వరకూ మెయిన్ రోడ్డు, సిమెంట్ రోడ్డు విస్తరణ పనులను రూ.50 లక్షలతో చేపడుతున్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి డంపింగ్ యార్డుకు తరలించి, కంపోస్టు షెడ్డులో వేసి సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నారు.

పెదఅమిరం పంచాయతీకి పురస్కారం..

పేదరికం లేని మెరుగైన జీవనోపాధి గ్రామ పంచాయతీ అనే అంశంపై పెదఅమిరం పంచాయతీ స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించింది. ఉపాధిహామీ, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్, జీవనోపాధి - ఆదాయ అసమానత, పేదరికాన్ని పరిష్కరించడంలో, పేద, బలహీన అట్టడుగు వర్గాలకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడంలో పంచాయతీ కీలకంగా వ్యవహరిస్తోంది. ఉపాధి అవకాశాలు, సామాజిక రక్షణ, గృహాలు, ఆరోగ్యం, విద్యతో సహ ప్రాథమిక సేవలు పొందడం, పొదుపు, రుణాల కోసం వాతావరణాన్ని కల్పించడం వంటి విషయాల్లో పెదఅమిరం గ్రామ పంచాయతీ ప్రధానంగా ఉంది. పెదఅమిరం గ్రామ పంచాయతీ ఉత్తమ పంచాయతీగా మండల స్థాయి అవార్డును సాధించింది. కాళ్ల ఎంపిపి పి.శిరీష విశ్వనాథరాజు, ఎంపిడిఒ జి.స్వాతి, గ్రామ సర్పంచి దొక్కు సోమేశ్వరరావును సత్కరించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు సహాయ సహకారాలతో గ్రామ అభివృద్ధి జరుగుతోంది.

గ్రామంలో ఏ వీధి చూసినా సీసీ రోడ్లతో అందంగా తీర్చిదిద్దారు. రోడ్లకిరువైపులా నాటిన మొక్కలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. గ్రామంలో నీటి సమస్య లేకుండా నిరంతరాయంగా నీటిని సరఫరా చేస్తున్నారు. పారిశుధ్య నిర్వహణలో పంచాయతీ సర్పంచి సోమేశ్వరరావు, సెక్రటరీ కనకరావు, ఉపసర్పంచి జవ్వాది లీలా కిషోర్, పంచాయతీ సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకుని కృషి చేస్తున్నారు.

ప్రగతి పథంలో పెదఅమిరం

దొక్కు సోమేశ్వరరావు, సర్పంచి, పెదఅమిరం



ముందస్తు ప్రణాళికతో అభివృద్ధిలో గ్రామం దూసుకుపోతోంది. గ్రామం ఆహ్లాదకరంగా మారింది. గతంలో సమస్యలన్నీ పరిష్కారమయ్యాయి. గ్రామస్తులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేయడంతో పాటు గ్రామంలో 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఈ సీసీ కెమెరాలను పంచాయతీ కార్యాలయానికి అనుసంధానం చేశాం. మున్ముందు ప్రభుత్వనిధులతో పాటు డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

కరోనా తర్వాత ఆరు నెలలకోసారి వైద్య పరీక్షల నేపథ్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని రాజమండ్రి రుడా ఛైర్మన్ మేడపాటి షర్మిలా రెడ్డి అన్నారు. సోమరాజు ఇల్లింద్రపర్రులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న షర్మిలారెడ్డి వృద్ధులతో వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి వనుం సూర్యనారాయణ, ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి), మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కొవ్వూరి చిన్నారెడ్డి పాల్గొన్నారు.

ఆకివీడు : ఇంటి ముంగిటకే వైద్యం అందించే విధానం జగనన్న ఆరోగ్య సురక్ష అని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. శుక్రవారం అయిభీమవరం కెవిఎన్ఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం సర్పంచి గాలి సామ్రాజ్యం అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఈ శిబిరంలో ప్రతి ఒక్కరూ వైద్యం పొందొచ్చన్నారు. వైసిపి సీనియర్ నాయకులు కనుమూరు అబ్బాయి రాజు మాట్లాడారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అల్లూరి సుబ్బరాజు, మండల అధ్యక్షులు ఆన్యం కృష్ణ, రూరల్ బ్యాంకు ఛైర్మన్ కేసిరెడ్డి మురళి పాల్గొన్నారు.

గణపవరం : గ్రామాల్లో పేదలకు ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తోంది ముఖ్యమంత్రి జగన్ అని జెడ్‌పిటిసి దేవవరపు సోమలక్ష్మి అన్నారు. వల్లూరులో


పాలకోడేరు : మాట్లాడుతున్న పివిఎల్ నరసింహరాజు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి గ్రామ సర్పంచి ముత్యాల వేణు అధ్యక్షత వహించారు. సోమలక్ష్మి మాట్లాడారు. శిబిరంలో 1,145 మందికి వైద్య సేవలందించారు. కార్యక్రమంలో డాక్టర్లు పి.సంతోషనాయుడు, కె.ప్రియాంక, శ్వేతశ్రీ, ఎన్.నిహారిక పాల్గొన్నారు.

పాలకోడేరు : తమ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించి ముందుకు సాగుతున్నట్లు డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. విస్సాకోడేరు సచివాలయం-2 పరిధిలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి పివిఎల్ నరసింహరాజు, ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటిరాజు) ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సర్పంచి బొల్ల శ్రీనివాస్ అధ్యక్షత వహించి మాట్లాడారు. పేదవారికి దగ్గరగా పెత్తందారులకు దూరంగా ముఖ్యమంత్రి జగన్ అడుగులు వేస్తున్నారన్నారు. పివిఎల్ నిజాయతీకి మారుపేరన్నారు. పివిఎల్ మాట్లాడుతూ ప్రభుత్వం రెండు పథకాలపై ప్రధానంగా దృష్టి పెట్టి అమలు చేస్తోందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చేకూరి రాజా నరేంద్రకుమార్, కోఆప్షన్ సభ్యురాలు డిఆర్.స్వర్ణలత, ఎంపిటిసిలు బొల్లం గాంధీ, వైసిపి ముఖ్య నేతలు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : నిరుపేదలకు సంజీవని జగనన్న ఆరోగ్య సురక్ష అని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పట్టణంలోని 1, 2, 3, 4, 5, 6, 7 వార్డులకు సంబంధించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను స్థానిక టైలర్ హైస్కూల్లో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముదునూరి ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని లక్షల నిరుపేదల కుటుంబాలను ప్రభుత్వం వైద్య పరంగా ఆదుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్‌పిటిసి రాధాకృష్ణ పాల్గొన్నారు.

మొగల్తూరు : పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్షను ప్రభుత్వం అమలు చేస్తోందని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మొగల్తూరులోని జగన్ ఆరోగ్య సురక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మొగల్తూరులో నూతనంగా రూ.22 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, జెడ్‌పిటిసి తిరుమాని బాపూజీ, వైస్ ఎంపిపిలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ భీమవరం 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 147/2020
వాది: ఎర్రంసెట్టి వీర ఆంజనైలు
ప్రతివాదులు:
డి-2: కందుల రత్న కుమారి
డి-3: కందుల సంధ్య
Order 5 Rule 20 C.P.C. ప్రకారం ప్రతివాదులకు నోటీసు

పై నెంబరు దావాలో 2,3 ప్రతివాదులకు కోర్టు వారు ఎన్నిసార్లు సమన్సు పంపినా అమలు జరగనందున కోర్టు వారు దావాను **ది.30-10-2023 వ తేదీకి వాయిదా వేసినారు.** కావున 2,3 ప్రతివాదులు పై తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥10:00 ని॥లకు హాజరై వారి సంజాయిషీ తెలుపుకోవలసినదిగాను లేని పక్షంలో వారి పరోక్షంలో దావా తీర్మానం కాబడునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

మోగంటి శివకృష్ణ
భీమవరం, వాది తరపు లాయర్
13-10-23. సెల్: 98485 39039

In The Court Of The Principal Junior Civil Judge At Tanuku
O.S.No. 379 of 2022
Between:
Manthena Peddi Raju ...*Plaintiff*
AND
Satti Srinivasa Reddy, S/o. Satyanarayana Reddy, Near Sai Baba Temple, Vemana Street, Kommara Village, Attili Mandal, Tanuku J.C.J.C.
...*Defendant*
వాది తరపున వేయించిన ప్రకటన

ఇందుమూలముగా ప్రతివాదికి తెలియజేయునది ఏమనగా.., పై నెంబరు గ్రంథములో కోర్టు ద్వారా సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు సమన్లు పేపరు ప్రకటన ద్వారా ఆర్డరు వేసినారు. కావున ఈ ప్రకటన ప్రచురణ నుండి 30 రోజులలోపు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరు అయ్యి అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు దావా విచారించబడునని ఇందుమూలముగా తెలియజేడయమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
రాయప్రోలు రాజు కిరణ్
ఆర్.ఏ.బేగమ్
తణుకు, న్యాయవాదులు, తణుకు.
11-10-23 సెల్: 83414 37279

In The Court Of The Prl. Senior Civil Judge At Khammam
I.A.No. 2/2022
In O.S.No. 428 of 2013
Between:
Om Shakthi Traders, Rep. by its Managing Partner Ch.Santhosh Kumar.
...*Petitioner /Plaintiff*
AND
1) Renuka Ginning Mills, Rep. by its Manager.
2) Danda Pullaiah
3) Mullapudi Renuka (Proposed Respondent /D3)
...*Respondents /Defendants*
TO: Dr.Mullapudi Renuka, D/o. Danda Pullaiah, Age Adult (TDP Mahila Leader, Tanuku, West Godavari District) Permanent R/o. H.No. 11-4-62/3, Nehru Nagar, Khammam City and District (Proposed Respondent /Defendant No.3)

Whereas the above named Petitioner /Plaintiff filed the above application under Order 1 Rule 10(2), R/W Sec.151 of CPC for added the Proposed Respondent /Defendant No.3 in the above matter and the same is stands posted on 31-10-2023 for your appearance either in person or through counsel duly instructed to file counter before the above said **Court at 10:30 A.M. on 31-10-2023,** if you fails to appear before the above said court the matter will be decided ex-party.

//By Order Of Court//
PEDDI HAYAGREEVA
Khammam, Advocate, Khammam.
11-10-2023. Cell: 98490 43167

పత్రికా ప్రకటన
In The Court Of The Hon'ble Principal Junior Civil Judge, Eluru, W.G.Dist., (Presently Eluru Dist.,)
I.A.No. 483/2021
in O.S.No. 190/2020
Manthena Kumar Babu
...*Petitioner /Plaintiff*
AND
Padala Satyam
...*Respondent /Defendant*
Respondent /Defendant:
Padala Satyam, S/o. Late Sanyasi, D.No. 20E-13-22, Pappalavari Veedhi, 16th Ward (Now 40th Division) Eluru, Eluru District.

పై నెంబరు పిటీషను గ్రంథములో రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసు పంపిననూ మీరు ఉద్దేశ్యపూర్వకంగా సదరు నోటీసును అందుకొనక త్రోసిపుచ్చుచున్నారు. కావున ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా పై నెంబరు పిటీషను గ్రంథము ది.30-10-2023వ తేదీకి వాయిదా వేసినందున మీరు సదరు వాయిదా రోజు అనగా **ది.30-10-2023వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా మీ ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ముందు హాజరై మీ వాదనను తెలియచేయ వలసినదిగా కోరడమైనది.** మీరు అట్లు హాజరు కాకపోయిన ఎడల శ్రీ కోర్టు వారు మిమ్ములను ఎక్స్‌పార్టీ చేసి, మీ పరోక్షములో పై నెంబరు పిటీషను గ్రంథమును తీర్మానించెదరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
సబ్బి అజయ్ కుమార్
ఏలూరు, అడ్వకేట్, ఏలూరు.
12-10-23. సెల్: 80740 60191

సిపిఎం సానుభూతిపరుడు బాబూరావు మృతి

యలమంచిలి:సిపిఎం సానుభూతి పరుడు, మండలంలోని చించినాడ గ్రామం అరుంధతీ పేటకు చెందిన శెట్టిమి బాబూరావు (65) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. బాబూరావు భౌతికకాయాన్ని సిపిఎం సీనియర్ నాయకులు కేతా సూర్యారావు, సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, సిఐటియు మండల అధ్యక్షుడు దేవ సుధాకర్, కెవిపిఎస్ నాయకులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్ సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ 1977 - 80 మధ్యకాలంలో చించినాడలో భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిన మహా పోరాటంలో బాబూరావు ధైర్య సాహసాలతో పాల్గొన్నారన్నారు. అనంతరం బాబూరావు భౌతికదేహంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు, ఈ కార్యక్రమంలో బాబూరావు సోదరులు నాగేశ్వరరావు, భాస్కరరావు, శ్రీనివాసులు, నాయకులు తెన్నేటి సంపతరావు, ఎం.ఆంజనేయులు, గోగినేని సత్యనారాయణ, తెన్నేటి స్టాలిన్, పల్లేరు వెంకటస్వామి, ఎం.ఈశ్వరుడు, జి.శ్రీనివాస్, ముస్కూడు విజయ్ కుమార్, పల్లేరు విజయ్ పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

తాడేపల్లిగూడెం:తణుకు న్యాయవాది అయినంపూడి కామేశ్వరరావు షాపులకు నిప్పు పెట్టి ఆర్థిక నష్టం కలుగజేసిన వారిపై ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు కట్టకపోవడాన్ని ఖండిస్తూ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ శుక్రవారం న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొవ్వూరి అప్పిరెడ్డి, జనరల్ సెక్రటరీ దాసం సునీల్ కుమార్, ఉపాధ్యక్షుడు తోట మురళి పాల్గొన్నారు.

ఉపయోగపడని పరికరాలను లయన్స్‌కు అందించండి

తాడేపల్లిగూడెం:ఇంటిలో, కార్యాలయాల్లో ఉపయోగపడని ఎలక్ట్రానిక్ పరికరాలను లయన్స్ క్లబ్ ప్రతినిధులకు అందించాలని, తద్వారా పర్యావరణ పెనుముప్పు నుండి కాపాడాలని ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ అన్నారు. జిల్లా క్యాబ్‌నేట్ యాక్టివిటీస్ సెక్రెటరీ లయన్ కొమ్ముల మురళీకృష్ణ అధ్యక్షతన ఈవేస్ట్ మోహన్ రూపొందించిన కరపత్రాలు వీడియోను జిల్లా లయన్స్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు పర్యవేక్షణ రవీంద్రనాథ్ చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాణిక్యాలరావు మాట్లాడుతూ హానికరమైన వ్యర్థాలతో కలుషితం అవుతున్న పరిస్థితిలో అవసరం లేని ఎలక్ట్రానిక్ వస్తువులను అంతర్జాతీయ లయన్స్ క్లబ్ ప్రతినిధులుకు అందించి భావితరాలకు బంగారు భవిష్యత్ కు బాటలు వేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ ఛైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు, శివన్నారాయణ, యెలిశెట్టి సత్యదేవ్ పాల్గొన్నారు.

ఇరుకు గదిలోనే అధికారుల భోజనాలు

పెనుమంట్ర:మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం మండల స్థాయిలో స్పందన కార్యక్రమం జరిగింది. అయితే కార్యక్రమం పూర్తయిన తరువాత జిల్లాస్థాయి అధికారులకు ప్రశాంత వాతావరణంలో భోజనం సౌకర్యం కల్పించారు. అయితే అంతా బాగానే ఉంది గానీ స్థానిక శాఖల అధికారులకు, సిబ్బందికి మాత్రం ఇరుకు గదిలో భోజనం సౌకర్యం కల్పించడంతో నిలబడడానికి కూడా చోటు పరిస్థితి. దీంతో అధికారులు భోజనం చేసేందుకు చాలా ఇబ్బంది పడ్డారు. సరైన భోజన సౌకర్యం లేదంటూ గుసగుసలు వినిపించాయి.

'సోషల్ మీడియా ప్రచారంలో వాస్తవం లేదు'

ఉండి:తాను పార్టీ మారుతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను ఉండి మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు శుక్రవారం ఖండించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను పార్టీ మారబోతున్నాననే వార్తలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. కావాలనే నియోజకవర్గ ప్రజలను గందరగోళంలోకి నెడుతున్నారని తెలిపారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

16న వీరవాసరంలో రైతు సదస్సు

వీరవాసరం:ఈ నెల 16వ తేదీన రైతు సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎపి రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు జుత్తిగ నరసింహమూర్తి, ఆకుల హరేరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయం వద్ద ధాన్యం మద్దతు ధర, కొనుగోలు సమస్యలపై సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు క్వింటాకు రూ.ఐదు వందలు బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పట్ల రైతులు ఆందోళనలు చేస్తే తప్ప వారి సమస్యలు తీరని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. సార్వా ధాన్యం కొనుగోలుపై అధికారులు, ప్రభుత్వం హడావుడీ ప్రారంభమైందని, రైతుల చేతికి పంట వచ్చిన తరువాత వారి గోడు పట్టించుకునేనాథుడే ఉండడని విమర్శించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సదస్సులో చర్చించి ప్రభుత్వం ముందుంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సదుస్సుకు రైతులు, కౌలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

కౌలు రైతుల శిక్షణ తరగతులు వాయిదా

భీమవరం:ఈ నెల 12, 13, 14 తేదీల్లో జరగాల్సి ఉన్న కౌలు రైతుల సంఘం రాష్ట్ర శిక్షణా తరగతులు అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రామాంజనేయులు తిలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కౌలు రైతుల సమస్యలు, నూతన వ్యవసాయ పద్ధతులపై భీమవరంలో నిర్వహించే రాష్ట్ర శిక్షణా తరగతులు కొన్ని కారణాల వల్ల వాయిదా వేశామన్నారు.

17న శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహావిష్కరణ

పాలకొల్లు :ఈ నెల 17వ తేదీ మంగళవారం సాయంత్రం 5.30లకు పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాల్లో శ్రీకృష్ణ దేవరాయలు 494వ వర్థంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు శ్రీకృష్ణ దేవరాయ సేవా సమితి అధ్యక్ష కార్యదర్శులు యర్రంశెట్టి వెంకటరత్నం, వంగా నరసింహారావు చెప్పారు. ఈ మేరకు సాహితీ సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేవరాయలు విగ్రహాన్ని మాజీ ఎంఎల్ఎ బాబ్జీ ఆవిష్కరిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా నిరుపేదలకు కామిశెట్టి అయ్యప్ప నాయుడు చేయూత ఇస్తారని చెప్పారు.

నేడు కంకణాకార సూర్యగ్రహణం

ఉండి:ఆకాశంలో అప్పుడప్పుడు అరుదైన సంఘటనలు జరుగుతాయి. అలాంటి అరుదైన దృశ్యం శనివారం రాత్రి జరగబోతోందని జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు గాదిరాజు రంగరాజు తెలిపారు. ఇప్పుడు ఏర్పడబోయేది కంకణాకార సూర్యగ్రహణమని తెలిపారు. చంద్రుడు సూర్యుడిని పూర్తిగా కవర్ చేయడని, సూర్యుని వెలుపల భాగం కంకణం వలే మనకు కనిపిస్తుందని తెలిపారు. ఇది ఉత్తర అమెరికా, కెనడా, గ్వాటిమాల, మెక్సికో, అర్జెంటీనా, కొలంబియా, క్యూబా, బార్బడోస్, పెరు, ఉరుగ్వే, ఆంటిగ్వా తదితర దేశాల్లో కనిపిస్తుందని, భారత దేశం లో మాత్రం కనిపించదని తెలిపారు. ఇది రాత్రి గం 8.34 నిమిషాలకు ప్రారంభమై తెల్లవారుజామున 2.25 నిమిషాలకు ముగుస్తుందని, నాసా వారు దీన్ని చూసేందుకు ఏర్పాట్లు చేశారని రంగరాజు చెబుతున్నారు.

చదువు ప్రగతికి తొలి మెట్టు

ప్రజాశక్తి - తణుకురూరల్

విద్యార్థినులు విలువలతో కూడిన విద్యనభ్యసించాలని కవి, రంగస్థల నటుడు, విశ్రాంత వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు వాడ్రేవు సుందరరావు అన్నారు. శుక్రవారం ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పీజీ (అటానమస్)లో కొత్తగా చేరిన విద్యార్థినులకు స్వాగతం పలుకుతూ సీనియర్ విద్యార్థినులు ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుందరరావు మాట్లాడుతూ అంబేద్కర్ అన్నట్లుగా చదువు మనిషి ప్రగతికి మొదటి మెట్టు అన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం సుందరరావును ఘనంగా సత్కరించారు. జర్నలిజంలో డిప్లమో సాధించిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, ట్రెజరర్ నందిగం సుధాకర్, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.